

ఉష్ణోగ్రత: గరిష్ఠం 36.9 కనిష్ఠం 21.9

పదైపోయింది!



ముగిసిన పది పరీక్షలు సెంటర్ల వద్ద విద్యార్థుల సందడి



మర్పల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం



ఘట్‌కేసర్ రూరల్: కొర్రెముల హైస్కూల్ వద్ద ఉత్సాహంగా విద్యార్థినులు

పదో తరగతి పరీక్షలు బుధవారం జరిగిన చివరి పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. దీంతో సెంటర్ల వద్ద విద్యార్థులు సందడి చేశారు. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీలు పట్టి పరీక్షలు ముగియడంతో కేరింతలు కొట్టారు. స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆల్‌ది బెస్ట్ చెప్పుకున్నారు. అనంతరం పలువురు బేకరీలు, రెస్టారెంట్లలో కేకులు, బిర్యానీలు, కూల్‌డ్రింక్స్‌తో పార్టీలు చేసుకున్నారు. పాఠశాల స్థాయిలో చివరి పరీక్షలు కావడం, ఇంటర్మీడియట్ ఆపై కోర్సుల్లో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన నేపథ్యంలో తోటివారితో సరదాగా గడిపారు. ఓ వైపు పరీక్షలు ముగిశాయన్న సంతోషం.. మరో వైపు స్నేహితులను విడిపోతున్న బాధ వారి హృదయాలను కలిచివేసింది. కాగా, చివరి పరీక్షకు మేడ్చల్ జిల్లాలో 99.77 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. -ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఏప్రిల్2



పరీక్ష అనంతరం సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

'యువ వికాసం'ను విజయవంతం చేయాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం చేపట్టిందని, అమలుకు అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మండల కేంద్రంలో రాజీవ్ యువ వికాస కేంద్రం ఏర్పాటు చేసి ఏప్రిల్ 14 వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల సేకరించాలన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం పది వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సంబంధించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. జూలై మొదటి వారం వరకు ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. సన్న బియ్యం పథకం పేద వారి గుండెల్లో శాశ్వతంగా ఉండాలనే సంకల్పం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. డీలర్లు సన్నబియ్యం పంపిణీని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు సంబంధించి తహసీల్దార్లు స్థల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్ , సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, నవీన్, హన్మంత్ రావు, కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్నులో 5శాతం రాయితీ

'ఎర్లీ బర్డ్'పై ప్రభుత్వం ప్రకటన

తాండూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్‌గా ఆస్తి పన్ను చెల్లించిన యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆస్తి పన్ను రెగ్యులర్‌గా చెల్లించిన వారికి ఎర్లీబర్డ్ స్కీంను ప్రకటించింది. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లించే యజమానులకు పన్ను చెల్లింపులో 5శాతం రాయితీని ప్రకటించింది. మున్సిపల్ యాక్ట్ 2019లోని సెక్షన్ 100 ప్రకారం రెగ్యులర్‌గా ఆస్తి పన్ను చెల్లిస్తున్నవారికి ఈ 5శాతం రాయితీ వర్తించనుంది. ఈ నెల 30వరకు ఎర్లీ బర్డ్ స్కీంను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. పట్టణ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో హరిప్రియ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీ రాణి, ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్, ఏవో రామ్మోహన్, వెంకటేశ్వర్లు, నర్సయ్య, జిల్లా కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మరో అవకాశం

అనుమతి లేని లే అవుట్లలో కొనుగోలు చేసిన స్థలాలు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఇచ్చిన గడువు మరో నెల రోజులు పొడిగించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీని మొదట మార్చి31 వరకు అవకాశం ఇచ్చినా దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. దీంతో వారి విజ్ఞప్తి మేరకు తాజాగా ఏప్రిల్ నెలాఖరు వరకు ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

స్పందన అంతంతే!



ఎల్ఆర్ఎస్‌కు ముందుకురాని దరఖాస్తుదారులు

'మార్చి'లో ఫీజు చెల్లించింది 5,214 మంది మాత్రమే.. వసూలైన మొత్తం రూ.14.05 కోట్లు

ప్రచారం చేసినా స్పందన కరువు.. ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పొడిగింపు

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పించినా మార్చి నెలాఖరు వరకు జిల్లాలో అంతంత మాత్రంగానే స్పందన లభించింది. అధికారులు ఆశించిన స్థాయిలో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకు రాలేదు. జిల్లా వ్యాప్తంగా 4 మునిసిపాలిటీలు, 594 గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 37,313 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులకు సంబంధించి జారీ చేసిన ఫీజు లెటర్లను 33,061 మంది స్వీకరించగా, మార్చి నెలలో కేవలం 5,214 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఫీజు రూపంలో రూ.14.05 కోట్లు వసూలైంది.



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	క్రమబద్ధీకరించినవి	వసూలైన ఫీజు (రూ.కోట్లలో)
పరిగి	4,299	527	1.61
తాండూరు	12,344	991	3.02
కొడంగల్	406	78	0.38
వికారాబాద్	4,052	885	2.95
పంచాయతీలు	16,212	2,733	6.09
మొత్తం	37,313	5,214	14.05

వికారాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్లాట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం సైతం నిర్వహించారు. ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎల్ఆర్ఎస్‌పై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించినా ఆశించిన స్థాయిలో స్పందన కన్పించలేదు. ప్రారంభం నుంచి ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు, లోపాల కారణంగా ఇబ్బందులు తప్పలేదు. దీంతో ఏప్రిల్ నెలాఖరు రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించడంతో వివిధ కారణాలతో ఫీజు చెల్లించలేకపోయిన దరఖాస్తుదారులకు ఊరట లభించనుంది.

సద్వినియోగం చేసుకునేలా..

జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం 2020లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్త వారికీ 25 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు వచ్చిన దరఖాస్తుల్లో 20 శాతం కూడా ఫీజు చెల్లించేందుకు ముందుకు రాలేదు. అనుమతి లేని

మిగతా 8వ పేజీలో...



కెరెల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రసాద్‌కుమార్

3.10కోట్ల మందికి సన్నబియ్యం

దేశంలో సన్నాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అలాగే దేశంలోనే సన్నబియ్యం అందిస్తున ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని కెరెల్లి గ్రామంలో బుధవారం ఆయన సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నట్లు చెప్పారు. అనంతరం ధారూరు రైతు వేదికలో 94 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను, 9మంది సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ సాజిదాబేగం, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, మాన్ సింగ్, విజయబాస్కర్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, బుజ్జయ్యగౌడ్, చెన్నారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన సన్నబియ్యం

వికారాబాద్: ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని పాతగంజిలో చౌకధర దుకాణంలో బుధవారం ఆయన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా 22,404 రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపులో భక్తులు

ఘనంగా రథోత్సవం

అలరించిన బండలాగుడు పోటీలు

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు.. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు



బండలాగుడు పోటీల్లో రైతులు

కొడంగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ వేంకటేశ్వరస్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగుతున్నాయి. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాలకు పరిసర ప్రాంతాలతో పాటు కర్నాటక తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మార్చి 25న ప్రారంభమై నేటి(ఏప్రిల్3)తో

మిగతా 8వ పేజీలో..



హెచ్‌సీయూలో వేలాన్ని ఆపాలి

పర్యావరణాన్ని కాపాడాలి

లాఠీచార్జిపై మండిపాటు

సీపీఎం ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు, ర్యాలీలు

8


రాజ్యాధికారంలో వాటా కల్పించాలి

- మట్టి తింటూ దివ్యాంగుల వినూత్న నిరసన



మట్టి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

పరిగి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు మంత్రివర్గంలో స్థానం కల్పించి రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం పరిగిలో వినూత్న నిరసనను వ్యక్తం చేశారు. మట్టిని తింటూ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ రూ.3,000 కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చారని, ఇప్పుడు ఒక్కటి కూడా పరిష్కరించకుండా పూర్తి విస్మరిస్తున్నాడని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి దివ్యాంగులకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. మంత్రివర్గంలో స్థానంతోపాటు, దివ్యాంగుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.3 వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు, సంఘం నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, చుక్కయ్య,గణేశ్,చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ

నేటి నుంచి రెండురోజుల పాటు తరగతులు.. మేడ్చల్ జిల్లాలో 338 మందికి పదోన్నతి

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): గతేడాది జూన్‌లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు నేటి నుంచి రెండు(3,4 తేదీల్లో) రోజుల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల పెంపుదలతో పాటు పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌ఈఆర్‌టీ) ఆదేశాల మేరకు జిల్లా నుంచి 338 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. పాఠ్య ప్రణాళిక, విద్యా ప్రమాణాలు, బోధన సోపానాలు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించనున్నారు.

బోధన తీరు మెరుగుపడేలా..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులందరికి కూడా రంగారెడ్డి జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో అన్ని కేటగిరిలలో 338 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. వీరందరూ శిక్షణలో పాల్గొంటారు. వీరిలో పీజీ హెచ్ఎం, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు అన్ని కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన వారున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా బోధన తీరును మెరుగు పరుచుకునేలా వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను నేరుగా పాఠశాలల్లో అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలివ్వాలి

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. నెలల పాటు పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పరిగి మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. జీవో నం.51ని అనుసరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరీలనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్మికుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు, కార్మికులు రామస్వామి, వెంకటయ్య, యాదయ్య, శ్రీను, సుక్కమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయండి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లానాయకులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌తో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, కార్యదర్శి పవన్‌కుమార్, వినోద్‌కుమార్ మాట్లాడారు. విద్యాశాఖ కార్యాలయంలో 14పోస్టులుండగా ఆరుగురే పనిచేస్తున్నారన్నారు. 8 ఖాళీలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యమైతోందని చెప్పారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జంగయ్య, లబ్ధిదారులు

మంచాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులను పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం లబ్దిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగంపల్లి గేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను సమీప గ్రామాలైన నోముల, లింగంపల్లి, మంచాలకు చెందిన పేదలకు మంజూరు చేశారన్నారు. కానీ ఇప్పటికీ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదని చెప్పారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు ప్లాట్లు చూపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అ నంతరం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమం లో సీపీఎం నాయకులు బుగ్గరాములు, అశోక్ పాల్గొన్నారు.

విశారదన్ నుంచి రక్షణ కల్పించండి



డీసీపీకి ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న సొంటె శ్రీనివాస్

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు సొంటె శ్రీనివాస్ బుధవారం శంషాబాద్ డీసీపీ బి.రాజేష్‌ను కలిశారు. తనకు ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహరాజ్‌తో సైద్ధాంతిక విభేదాలున్నాయని, అతడి నుంచి తనకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. గతంలో తాను విశారదన్‌తో కలిసి పనిచేశానని తెలిపారు. ఉద్యమం మాటున విశారదన్ చేసిన ఆర్థిక అవకతవకలపై ప్రశ్నిస్తే, తనపై తప్పుడు కేసులు పెట్టి బైలుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రస్తుతం బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా ఉన్నానని తెలిపారు. బీఎస్పీని నిర్వీర్యం చేసేందుకు, తనను ఇబ్బంది పెట్టేందుకు విశారదన్ తన అనుచరులతో బెదిరిస్తున్నాడని చెప్పారు. విశారదన్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, కాబట్టి రక్షణ కల్పించాలి డీసీపీని లిఖిత పూర్వకంగా కోరినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా అభయాంజనేయాలయ వార్షికోత్సవం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నర్కూడ అమ్మపల్లి సీతారామచంద్రస్వామి సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విగ్రహ ప్రదాత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్ దంపతులు అధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చతుర్థి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల భక్తులు తరలొచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమార్‌యాదవ్, బి.సంజీవ, బి.గోపాల్, మెండె కుమార్, నాగేశ్ గౌడ్, మల్చలం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సీఎం ఇంటి ముట్టడికి ఎల్‌హెచ్‌పీఎస్ పిలుపు

మంత్రి వర్గంలో లంబాడాలకు స్థానమివ్వాలని డిమాండ్

సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ అరెస్ట్



రాంబల్‌నాయక్‌కు అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించాలని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించిన లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్‌ను కేశంపేట మండలం పొడగుట్ట తండాలోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే సంఘం మండల ప్రధాన కార్యదర్శి దేవుజానాయక్, రాంబాబునాయక్‌లనూ అరెస్ట్ చేశారు. అనంతరం రాంబల్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే రేవంత్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులను అరెస్ట్ చేస్తోందన్నారు. ఇది అప్రజాస్వామ్యికమన్నారు. అరెస్ట్ చేసిన లంబాడాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేశారు.

డీలర్‌ను మార్చాలని గ్రామస్తుల ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జైత్వారం రేషన్ డీలర్ ఆగడాలు మితిమీరుతున్నాయని, 12కిలోల బియ్యం తీసుకుంటే వారికి కిలో బియ్యం తరుగు వస్తోందని గ్రామస్తులు బుధవారం ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లకు ఫిర్యాదు చేశారు. రేషన్ షాపు నంబరు 1537012 డీలర్ ఎస్.విజయ లబ్ధిదారులకు బియ్యాన్ని సరిగ్గా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తరుగు ఎందుకొచ్చిందని నిలదీస్తే.. 'తీసుకుంటే తీస్కోండి.. లేదంటే పోండి.' అని అంటున్నారని చెప్పారు. గ్రామంలో 390 రేషన్ కార్డులున్నాయని, నెలనెలా రెండు మూడు క్వింటాళ్ల బియ్యం తక్కువిస్తున్నారని, లబ్ధిదారులు కూడా తగ్గించి తీసుకోవాలని డీలర్ బెదిరిస్తున్నారని అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రశ్నించిన తమపై ఎదురుదాడికి దిగిందని వాపోయారు. డీలర్‌పై విచారణ జరిపి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆర్డీవో స్పందిస్తూ.. తాము విచారణ చేసి ఫిర్యాదులు నిజమని తేలితే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహ, వెంకటేశ్, పాండు, వీరయ్య, డి.యాదగిరి, అంజయ్య, పి.మహేందర్, సి.మధుకర్‌రెడ్డి, జె.దర్శన్, వి.రవి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని విధుల్లోంచి తొలగించాలి



చౌదరిగూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కరవడానికి కారకులైన వారిని వెంటనే విధుల్లోంచి తొలగించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బాలికలు ఉగాది పండుగకు వెళ్లి భక్ష్యాలు తేవడంతోనే ఎలుకలొచ్చాయని సిబ్బంది చెప్పడం సరికాదన్నారు. బయటి నుంచి ఇతర ఆహార పదార్థాలు హాస్టల్‌లోకి తేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉందన్నారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా మాట్లాడడం ఆమె చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటం ఆడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కేవీపీఎస్ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

యాలాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ నేడు(గురువారం) నిర్వహించే వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. బుధవారం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో వర్క్‌షాప్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కులవివక్ష, అంటరానితనం నిర్మూలన, ప్రతిఘటన పోరాటాలపై నేడు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. తాండూరు పట్టణంలోని ఎంపీటీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ వర్క్‌షాప్‌నకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు హాజరవుతారని తెలిపారు.

నాందేడ్-రాయచూర్, కాచిగూడ-రాయచూర్ రైళ్ల రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యెర్మారస్-రాయచూర్-మరిచెతల్ స్టేషన్ల మధ్య నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఏప్రిల్ 4, 5తేదీల్లో నాందేడ్-రాయచూర్, 5న కాచిగూడ-రాయచూర్‌ల మధ్య తిరిగే రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న నాందేడ్-రాయచూర్(17664), 5న రాయచూర్-నాందేడ్(17663) రైళ్లు, 5న కాచిగూడ-రాయచూర్(77647-77648) రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. నాందేడ్ డివిజన్ ఔరంగాబాద్-జాల్నా స్టేషన్ల మధ్య ట్రాఫిక్ సమస్య కారణంగా ఏప్రిల్ 3, 5, 6, 9, 10, 12, 13, 15, 16, 17, 19, 20, 22, 23, 24, 26, 27, 29 తేదీల్లో ఔరంగాబాద్-గుంటూరు- ఔరంగాబాద్(17254-17253) రైళ్లను ఔరంగాబాద్-చికల్‌తన్ స్టేషన్ల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఇదే నెలలో కొన్ని రోజులపాటు గుంటూరు-ఔరంగాబాద్- గుంటూరు (17254-17253) రైళ్ల ఔరంగాబాద్-జాల్నా ట్రైన్‌లను పాక్షికంగా రద్దుచేసినట్టు ఎస్సీఆర్ అధికారులు తెలిపారు.


మాట్లాడుతున్న రాములుయాదవ్

కురుమ, యాదవులు రాణించాలి

దుద్యాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కురుమ యాదవులు అన్ని రంగాల్లో రాణించేందుకు పోరాటం చేయాలని యాదవహక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ పిలుపునిచ్చారు. పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో బుధవారం ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనను యాదవ హక్కుల పోరాట సమితి వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్, శ్రీనివాస్, నర్సిములు, బాలప్ప, అంజి, శేఖర్, సారంగి, చంద్రశేఖర్, మొగులయ్య పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు


మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గాయత్రి

దౌల్తాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ గాయత్రి అన్నారు. శంకర్‌గుట్ట ప్రాంతంలో మైనింగ్ కొనసాగుతోందని పంచాయతీ కార్యదర్శి గోపాల్ ఫిర్యాదుతో ఆమె స్పందించారు. బుధవారం వెళ్లి పరిశీలించారు. 8ఎకరాలు మైనింగ్ తవ్వకానికి అనుమతులున్నాయని, గుట్ట ప్రాంతంలో ఆంజనేయస్వామి ఆలయం ఉందని, ఆలయం సమీపంలోకి రావొద్దని మైనింగ్ నిర్వాహకులకు సూచించారు. ఆమెతో డీటీ చాంద్‌పాషా, పీఎస్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం


సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకే బీసీ రిజర్వేషన్లను తెచ్చిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా తుంకిమెట్లలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపితే ప్రతిపక్ష పార్టీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, గౌడ సంఘం నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, బల్ల వెంకటయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సూర్యప్రకాశ్‌గౌడ్, శ్యామలయ్యగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

బొంరాస్‌పేట్/దుద్యాల: ఆదర్శవంతమైన పథకం సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం బొంరాస్‌పేట్, బుర్హాన్‌పూర్, తుంకిమెట్ల, వడిచర్ల, మెట్లకుంట గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. దుద్యాలలో సన్న బియ్యం పంపిణీని రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కృష్ణ, శ్రీశైలంగౌడ్, ఖాజామియా పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ?

- ధ్వంసమైన శేరిగూడ రోడ్డు
- నరకం చూస్తున్న వాహనదారులు
- బాగు చేయించాలని ఎమ్మెల్యేకు వేడుకోలు


గుంతలమయంగా రోడ్డు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శేరిగూడ-కొండాకల్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో శేరిగూడ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద గుంతలతో ప్రయాణించేందుకు గ్రామస్తుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. 3కి.మీ ఈ బీటీ(డాంబర్) రోడ్డుపై గుంతలు పడటంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట ఈ రోడ్డుపై వెళ్తే పడిపోవడం ఖాయం. గత ప్రభుత్వంలో గుంతలను పూడ్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం సైతం ఈ రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. 12ఏళ్ల క్రితం తారురోడ్డు వేసి అప్పటి నుంచి ఎలాంటి ప్యాచ్‌వర్క్‌లు, మరమ్మతులు చేయలేదు. భారీ గుంతలతో రోడ్డు వాహనాలు తిరగలేని విధంగా మారింది. రైతులు నిత్యం మార్కెట్‌కు కూరగాయలు, పువ్వులు, ధాన్యం బస్తాలను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగ లేక ఆటోలు కూడా రావడం లేదు. విద్యార్థులు, గ్రామస్తులకు శంకర్‌పల్లికి వచ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. ప్రజల ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే యాదయ్య రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన శేరిగూడ రోడ్డు

వెంటనే బాగు చేయించాలి



రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. పెద్దపెద్ద గోతులతో ప్రయాణించేందుకు వీలులేకుండా ఉంది. రోడ్డు బాగుచేయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నిసార్లు గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేకుండా పోయింది. రోడ్డు పూర్తిగా వేసే వరకు తాత్కాలికంగా గోతులను పూడ్చి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి.

- సత్యనారాయణ, మాజీ సర్పంచ్, శేరిగూడ

రైతులు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది



రోడ్డుపై గుంతలతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులు కూరగాయలు, ధాన్యం బస్తాలను మార్కెట్‌కు తరలించాలంటే కష్టంగా మారింది. ఆటోల్లో తరలిస్తే టైర్లు పంక్చర్ అవుతున్నాయి. ఈ రోడ్డుపై వాహనాలు తరచూ ఫెయిల్ అవుతున్నాయి. పదేళ్ల నుంచి పడుతన్న గుంతలు రోజురోజుకూ పెద్దవయ్యాయి. జిల్లా సరిహద్దులో ఉన్న మా గ్రామాన్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మా సమస్య తీర్చాలి.

- వెంకటేశ్, మాజీ వార్డు మెంబర్

సాగు భూమికి పట్టాలిప్పించండి


స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూమికి పట్టాలిప్పించాలని పులుమద్ది రైతులు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. హైదరాబాద్‌లో స్పీకర్‌ను కలిసి సమస్యను వివరించి వినతి పత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. తమ సాగు భూములను ఫారెస్ట్ భూమి అంటూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. తరచూ తాము ఆయా ప్రభుత్వాల అటవీశాఖ మంత్రులకు విన్నవిస్తేనే అధికారుల ఒత్తిడి తగ్గుతోందన్నారు. 1985కు ముందు ఈ భూమి ప్రభుత్వ భూమి అని, 1985 తరువాత ఫారెస్ట్ భూమి అని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. తాము సాగు చేస్తున్న ఈ భూమి 200 ఎకరాలుందని, అంతా బీసీ, ఎస్సీ రైతులే ఉన్నారని చెప్పారు. కొందరికి పట్టాలు ఉన్నాయని చెప్పారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పీకర్‌ను రైతులు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో శ్యామ్, సుదర్శన్, అంజయ్య, లక్ష్మణ్, దానయ్య, బిచ్చయ్య, నర్సింహులు, భుజంగం ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్


బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వికారాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వికారాబాద్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు నూలి బస్వరాజ్ పటేల్ తెలిపారు. బుధవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూలి బస్వరాజ్ పటేల్ జనరల్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ మాట్లాడుతూ వికారాబాద్ కోర్టు కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జూనియర్ న్యాయవాదులకు విజ్ఞానం పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, కమల్ రెడ్డి, అశోక్, లవకుమార్, మాధవరెడ్డి, నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్య, ఆనంద్, వసుంధర, రాథోడ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్.రామకృష్ణ కోరారు. జిల్లా అధ్యక్షుడిగా నాలుగు ఎమ్మెల్యే స్థానాల విజయానికి కృషి చేసిన రామ్మోహన్‌రెడ్డిని అధిష్ఠానం గుర్తించాలని కోరారు. ఎలాంటి పదవులు లేని రోజుల్లోనే పరిగి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికైన టీఆర్ఆర్‌ను పార్టీ గుర్తించాలని కోరారు. ఆయన పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

తాండూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను, సమాజ సేవాతత్పరులను విద్యార్థులు రోల్ మోడల్‌గా తీసుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎక్సెంచర్ ఐటీ సంస్థ మేనేజర్ అండ్ ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ చల్లా శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శాలివాహన డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ కల్వ రాధాకృష్ణ, డైరెక్టర్ మాణిక్యం, సుధాకర్, మల్లేశం, లెక్చరర్లు సిద్ధిలింగయ్య, బసంత్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించేందుకు కృషి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పించేందుకు తమ వంతు కృషిచేస్తున్నామని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో లేమూరు ఉన్నత పాఠశాలలో రూ.3.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్‌ను మాజీ సర్పంచ్ జి.కొండారెడ్డి, ఢిల్లీ గణేష్‌లు ప్రారంభించారు. గ్రామ ప్రత్యేకాధికారులు సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. వాటర్‌ఫిల్టర్‌ను ఏర్పాటు చేసిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిర్వాహకులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

తెల్ల రేషన్‌కార్డుంటే ఆదాయ సర్టిఫికెట్ అవసరం లేదు

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు ఆదాయ ధ్రువీకరణపత్రం పెట్టాల్సిన అవసరం లేదని ఎంపీడీవో సరిత తెలిపారు. బుధవారం మండల పరిషత్‌లో ఆమె మాట్లాడారు. యువ వికాసం స్కీంకు ఈ నెల 14వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వాళ్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్‌పుస్తకం, సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో అవసరమైన వాటిని పెట్టి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మహేశ్వరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగి రమేష్ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో నార్కొటిక్స్ బ్యూరో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ జహీదాబేగం, వైస్‌ప్రిన్సిపాల్ చందన, ఇంతియాజుద్దీన్, గోపాల్, శ్రీహరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కడ్తాల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలనకు అందరూ కృషిచేయాలని కడ్తాల ఎస్సై వరప్రసాద్ కోరారు. మహిళల చైతన్యంతో మానవ అక్రమ రవాణాను అరికట్టొచ్చన్నారు. కడ్తాలలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల నివారణ తదితర చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం రాజేశ్వరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కేశంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. లింగంధనకు చెందిన నెల్లికంటి బాలమ్మ అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. పేదరాలైన ఆమెకు ఎమ్మెల్సీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.45వేల చెక్కును మంజూరు చేయించారు. బుధవారం షాద్‌నగర్‌లోని తన కార్యాలయంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్, భాస్కర్, కృష్ణ, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

యాచారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాగునీరు సరిపోకుంటే బోర్ల నీటిని వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు ఎక్కడా నీటి కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఏపీవో లింగయ్య, ఎంపీవో శ్రీలత పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వికారాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2017లో కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్పెషల్ సెషన్స్(ఎస్సీ, ఎస్టీ కోర్టు) జడ్జి ఎం.భవానీ బుధవారం తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. 2017 మార్చి 30న ఉదయం కోట్‌పల్లిలో కత్వ కింది ప్రాంతంలో మహిళా శవం ఉందని కోట్‌పల్లికి చెందిన దొరటి నర్సయ్య, గ్రామస్తులు గుర్తించారు. అది తన తమ్ముడి భార్య(మరదలు) ఆడవమ్మదిగా గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు తీవ్రత దృష్ట్యా 302ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేశామన్నారు. అప్పటి డీఎస్పీ శిరీషరాఘవేందర్ దర్యాప్తు చేయగా లింగంపల్లి గ్రామానికి చెందిన నిందితుడు ఎర్రగొల్ల మహేశ్ మహిళను హత్య చేసినట్టు తేలగా అతడిని అరెస్ట్ చేశారన్నారు. కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించామన్నారు. సుదీర్ఘ విచారణ తరువాత జడ్జి భవానీ నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. బాధితుల తరఫున పీపీలు ఎస్.ప్రతాప్‌రెడ్డి, జి.భద్రాద్రి, అప్పటి డీఎస్పీ శిరీష రాఘవేందర్, ధారూర్ సీఐ ఉపేందర్, ప్రస్తుత ఐవో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, కేసు బ్రీఫింగ్ ఆఫీసర్, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, సీడీవో మహేశ్వర్‌రెడ్డి పనిచేశారని, వారందరికీ అభినందనలని ఎస్పీ తెలిపారు.

మార్కెట్ యార్డులో ముహూర్తపు బీట్లు

తాండూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ముహూర్తపు బీట్లను చేపట్టారు. మార్కెట్‌లో యేటా ఉగాది తర్వాత ముహూర్తపు బీట్లను నిర్వహిస్తారు. బుధవారం విశ్వావసు నామ సంవత్సరంలో మొదటి పనిదినం నాడు 'ది గ్రైన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో బీట్లను నిర్వహించారు. పసుపు, కందులను కొనుగోలు చేశారు. పసుపు క్వింటాల్‌కు రూ.18,900, కందులు గరిష్ఠంగా రూ.7800, కనిష్ఠంగా రూ.7400 ధర పలికాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.బాల్‌రెడ్డి, గంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వ్యాపారులు రాంరెడ్డి, రాధాకృష్ణ, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

మోడీజీ.. బీసీ బిల్లును ఆమోదించండి

షాద్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ వ్యక్తి అయిన నరేంద్రమోదీ దేశ ప్రధానమంత్రిగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన ప్రసంగించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కలిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు కేంద్రం కూడా ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బీసీల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా బీసీ బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కీసర రూరల్/మూడుచింతలపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు కీసర, మూడుచింతలపల్లి పరిధిలో చోటుచేసుకున్నాయి. వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం కీసర అవుటర్ రింగ్‌రోడ్డులో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన అందె విజయ్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో కీసర వద్దకు చేరుకున్నాడు. డ్రైవర్‌ను మార్చేందుకు కారును ప్రక్కన నిలిపి డోర్ తెరుస్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని కంటైనర్ వాహనం కారును బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలైన విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను, పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన శామీర్ పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లికి చెందిన శివమ్మ(70) శామీర్‌పేట్ బస్టాప్ వద్ద ఇంటికి వెళ్లడానికి బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా బస్సును నడుపుతూ శివమ్మను ఢీ కొట్టడంతో ఆమె కిందపడిపోయింది. బస్సు ముందు టైర్ ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

పెద్దేముల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పెద్దఖానల వద్ద గల కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలోని నీటిలో బుధవారం పొలాలకు వెళ్లిన రైతులకు గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు రూరల్ సీఐ నాగేష్, యాలాల ఎస్‌ఐ గిరిలు పరిశీలించి విచారణ చేపట్టారు. దుండగులు ఆమె ముఖంపై పెట్రోల్ లేదా కిరోసిన్ పోసి నిప్పుపెట్టినట్లు గుర్తించారు. ఆమె ఎడమచేతిపై 'యశోద' అనే పచ్చబొట్టు ఉంది. దుండగులు ఆ పచ్చబొట్టును తుడిచిపెట్టే ప్రయత్నంలో చేయికి నిప్పుపెట్టారు. ఘటనాస్థలంలో మద్యం సీసా, వాటర్‌బాటిల్, మృతురాలి గాజులతో పాటు అవసరైన ఆధారాలను క్లూస్‌టీం సేకరించింది. అదేవిధంగా జాగిలాలు ఘటనాస్థలం నుంచి 2కిలోమీటర్ల దూరంలోని ఓ ఫాంహౌస్ సమీపం నుంచి వెళ్లడంతో పోలీసులు ఆ ఫాంహౌజ్‌లో పనిచేసే కూలీలను విచారించారు. ఇక్కడ పనిచేసే వారిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేసన్‌కు తరలించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం ఏం జరిగిందనే విషయాలు తెలుస్తాయని చెప్పారు.

పెళ్లి కావడంలేదని వ్యక్తి ఆత్మహత్య

పూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడంలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూడూరు మండల కేంద్రానికి చెందిన కడుమూరి ప్రసాద్(29) లారీ క్లీనర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా తనకు వివాహం జరగడం లేదని తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ప్రసాద్ ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కడుమూరి బిచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక అదృశ్యం


గణశ్రీ (ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో బాలిక అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి, హనుమాన్ వాడకు చెందిన గుంజ రాజశేఖర్, స్రవంతి రెండు నెలల క్రితం జీవనోపాధి కోసం కూతురు గుంజ గణశ్రీ(10), రెండేళ్ల కుమారుడితో కలిసి ఘట్‌కేసర్‌లోని మాదవరెడ్డి వంతెన సమీపంలో అద్దెకు ఉంటున్నారు. బుధవారం ఉదయం భర్త రాజశేఖర్ పనికి వెళ్లగా భార్య స్రవంతి 11.30లకు కూతురును ఇంట్లో వదిలి తన రెండేళ్ల కొడుకును తీసుకొని ఇళ్లలో పనిచేయడానికి వెళ్లింది. తిరిగి 12గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు పోలీసులకు పొంతనలేని సమాధానం చెబుతుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థి..


అజితేష్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన జి.రామకృష్ణ కుమారుడు అజితేష్(20) పోచారం మున్సిపాలిటీ, యంనంపేట్‌లోని గదిలో అద్దెకుంటూ శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. గత నెల 23న కరీంనగర్‌కు వెళ్లి తిరిగి 28న కళాశాలకు వచ్చాడు. మరుసటి రోజు 29న కళాశాలలోని జరిగిన ఫెస్ట్‌కు హాజరయ్యాడు. అదేరోజు సాయంత్రం వారాసిగూడలో ఉండే స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని రూమ్‌మేట్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. రాత్రి 7గంటల నుంచి అజితేష్ ఫోన్ కలవడం లేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కీసర రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం, యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మునీరాబాద్‌కు చెందిన సత్యానారాయణ వాటర్‌ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను ట్యాంకర్‌తో మొక్కలకు నీళ్లు పట్టే క్రమంలో, ట్యాంకర్‌లో నీరు తగ్గిపోవటంతో ట్యాంకర్‌ను పైకి ఎత్తాడు. ప్రమాదవశాత్తు ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని మహిళకు..

కీసర రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ ఈస్ట్‌గాంధీనగర్‌లో నివాసముంటున్న కమలమ్మ పనినిమిత్తం రాంపల్లి చౌరస్తాలోని భవానీనగర్‌కు వెళ్లింది. పనిముగించుకుని తిరిగి ఇంటికి బయల్దేరగా రాంపల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో అంబులెన్స్ ఘటనాస్థలానికి చేరుకుని ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పడావుబడ్డ డబుల్ ఇళ్లు!

- రెండేళ్లుగా పంపిణీలో నిర్లక్ష్యం
- లబ్ధిదారుల ఎంపికలోనూ అలసత్వం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- తాండూరు పట్టణ పేదల ఎదురుచూపులు



తాండూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టి రెండేళ్లు దాటింది. రూ.కోట్లు పెట్టి నిర్మించినా అవి పాడావుపడ్డాయి. గత ప్రభుత్వం రంగువేసి ఊరించీ.. ఊరించి పంపిణీ చేయకుండా చేతులెత్తేయడంతో సర్కార్ ఇళ్లు వస్తాయనుకున్న తాండూరు పట్టణ పేదలకు ఎదురుచూపులే మిగిలాయి. ఇందిరమ్మ రాజ్యంలోనైనా తమకు ఇళ్లు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. 2024 ఆగస్టులో తాండూరులో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించి రెండు నెలల్లో పేదలకు అందేలా చూస్తానన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీ సైతం అటకెక్కింది.

12 బ్లాకుల్లో నిర్మాణం

తాండూరు - హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఖాంజాపూర్ గేట్ వద్ద తాండూరు నియోజకవర్గానికి సంబంధించి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను పంపిణీ చేస్తామని గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడి చేసి చేతులెత్తేసింది. 2018లో ప్రారంభమైన పనులు ఏడేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. 1,001 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 581 ఇళ్లు పూర్తయ్యాయి. ఐదు బ్లాకుల పనులు స్లాబ్ స్థాయిలో ఉండగా మరో ఏడు బ్లాకులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇటీవల ప్రజాపాలనలో తాండూరు మున్సిపాలిటీలో 9,438 మంది పేదలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిర్మించిన ఇళ్లు వృథాగా శిథిలావస్థకు చేరకుండా పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటివరకు లబ్ధిదారులను ఎంపిక చేయలేదని త్వరగా లబ్ధిదారుల ఎంపిక చేయాలని కోరుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల పంపిణీకి ఎమ్మెల్యే చొరవ చూపాలని విన్నవిస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల వివరాలు	
పనులు ప్రారంభం	2018
మొత్తం ఇళ్లు	1,001
పూర్తయినవి	581
ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	9,438

హెచ్‌సీయూలో భూముల వేలాన్ని ఆపాలి


దుద్యాల: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


పరిగి: పీఎస్‌లో బీఎంపీ నాయకులు

దుద్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల వేలాన్ని ప్రభుత్వం ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. అదేవిధంగా మంగళవారం యూనివర్సిటీ గేటు దగ్గర ధర్నాకు పిలుపునివ్వగా సీపీఎం నాయకులను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లయ్య, పెంటప్ప, గంగమ్మ, కిష్టప్ప, రమేశ్, గంగమ్మ పాల్గొన్నారు.

తాండూరు: హైదరాబాద్ గచ్చిబౌలిలోని 400 ఎకరాల యూనివర్సిటీకి సంబంధించిన భూములను ప్రభుత్వం వెంటనే వేలాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు, విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి భూములను అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ తాండూరు డివిజన్ కార్యదర్శి సిరియాల, సీపీఎం నాయకులు వెంకటేష్, బాలస్వామి పాల్గొన్నారు.

పరిగి: హెచ్‌సీయూలో భూముల వేలాన్ని నిలిపివేసి, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ, సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. 400 ఎకరాల భూముల అమ్మకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బస్సు చంద్రయ్య, ఎండీ హబీబ్, సత్తయ్య, యాదగిరి, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆయా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌లను బుధవారం పరిగి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి ఇళ్ల దగ్గరకు పోలీసు వాహనంలో ఎక్కించుకుని స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచుకుని విడిచిపెట్టారు. అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ స్పష్టం చేశారు.

'విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం'

వికారాబాద్: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జి అమానుషమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయొద్దని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లను గవర్నమెంట్ అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. హైదరాబాద్ పట్టణం మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిందని అలాగే కొనసాగించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టడమనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రథోత్సవం

(ఐదో పేజీ తరువాయి)

ముగియనున్న ఉత్సవాల్లో ప్రధానంగా ధ్వజారోహణము, కల్పవృక్ష వాహనము, ఉగాది పంచాంగ శ్రవణం, లంకా దహనం, రథోత్సవం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అలాగే ప్రత్యేకంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు భక్తులను అలరించాయి. ప్రతీరోజు నిర్వహించే స్వామివారి ఊయాల సేవతో పాటు పాడుతా తీయగా కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

హాజరైన సీఎం కూతురు, అల్లుడు


రథోత్సవంలో సీఎం కూతురు నైనీషా, అల్లుడు సత్యనారాయణరెడ్డి

బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టంగా రథోత్సవం కనులవిందుగా కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి కూతురు నైనీషా, అల్లుడు సత్యనారాయణరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం జాతర స్థలంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలు దండ్ల భీములుకు మొదటి బహుమతి, బాకారం రుత్విక్‌రెడ్డికి ద్వితీయ బహుమతి, మద్దూర్ వెంకటయ్యకు తృతీయ బహుమతిని ఆలయ ధర్మకర్తలు అందించారు. ఉత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి కొడంగల్, తాండూర్ వారి ఆధ్వర్యంలో జాతర స్థలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీర్చారు. బ్రహ్మోత్సవాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

స్పందన అంతంతే!

(ఐదో పేజీ తరువాయి)

వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లో దరఖాస్తులు స్వీకరించిన అప్పటి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరణకే పరిమితం చేసింది. 2022, జూలై, 2023, ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం మార్కెట్ ధరలు భారీగా పెంచింది. పెంచిన ధరలతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు భారంగా మారడంతో క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం మరోసారి కల్పించిన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తే ఆదాయం గణనీయంగా సమకూరే అవకాశం ఉంది.

పంచాయతీల నుంచి రూ.6.09కోట్లు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 21,101 దరఖాస్తులు రాగా, వాటిలో 16,917 దరఖాస్తులకు సంబంధించి ఫీజు లెటర్లు స్వీకరించారు. కాగా, వీటిలో 2,481 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, మంగళవారం వరకు సంబంధిత అధికారులు 1,198 ప్రొసీడింగులు జారీ చేశారు. అలాగే ప్లాట్లను క్రమబద్ధీకరించడం ద్వారా మార్చి నెలలో రూ.14.05 కోట్ల ఆదాయం సమకూరింది. ఫీజుల రూపంలో పరిగి మునిసిపాలిటీలో రూ.1.61 కోట్లు, తాండూరులో రూ.3.02 కోట్లు, కొడంగల్‌లో రూ.0.38 కోట్లు, వికారాబాద్ మునిసిపాలిటీలో రూ.2.95 కోట్లు వసూలయ్యాయి. ఇదిలా ఉంటే, గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 16,212 దరఖాస్తులు రాగా, వాటిలో 2,733 దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. ఫీజుల రూపంలో గ్రామ పంచాయతీల నుంచి రూ.6.09 కోట్లు వసూలయ్యాయి.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


మర్పల్లి: సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

మర్పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని రేషన్ దుకాణాల్లో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ మునిరోద్దీన్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్, టేకులపల్లి, అమ్రాదికలాన్ తదితర గ్రామాల్లో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోవర్ధన్, సరిత పాల్గొన్నారు.

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని రేషన్‌దుకాణాల్లో బుధవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎండీ.యూసుఫ్, శివకుమార్‌గుప్త పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని పెద్దనందిగామ గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు బుధవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్‌గుప్త జగదీశ్వర్‌రెడ్డి, ఎన్.ప్రశాంత్ పాల్గొన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా కొత్తూర్ బాలప్ప

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యాదవ హక్కుల పోరాట సమితి బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడిగా కొత్తూర్ బాలప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు మేకల రాములు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుర్ర పెంటయ్య, నారాయణపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు పీరంపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ పోరు గర్జనలో ఎమ్మెల్యే



తాండూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బీసీ పోరు గర్జన మహాధర్నాలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి రిమాండ్

పరిగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దాయాదులతో ఘర్షణకు దిగి, హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమిరే సత్యనారాయణ, కొమిరే ప్రశాంత్ కుటుంబాల మధ్య ఉన్న పాతకక్షల కారణంగా మార్చి 23న ఘర్షణలకు దిగిన సంగతి తెలిసిందే. వాహనంతో స్పీడ్‌గా వెళ్లి ప్రవీణ్, సాయితేజ్‌పైకి ఎక్కించడంతో ఇద్దరి కాళ్లు విరిగాయి. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కొమిరే సత్యనారాయణ, అతడి తమ్ముళ్లు వెంకటేష్, ప్రవీణ్, ఆనంద్, శంకర్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

నూతన కమిటీ ఎన్నిక

కొడంగల్: మండలంలోని పాటిమీదిపల్లిలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాండు, ఉపాధ్యక్షుడిగా అశోక్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, దస్తగిరి, కోశాధికారిగా మహేందర్, గౌరవ సలహాదారులుగా కిష్టప్ప, బాలప్ప, బుగ్గప్ప తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు సూర్యనాయక్, నాయకులు సంతోష్, యు.రమేశ్‌బాబు, కృష్ణ మౌర్య, అన్నారం సాయిలు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

దోమ: మండల కేంద్రంలో బుధవారం పాలమూర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ వేసవి శిబిరం కొనసాగించడం కోసం వారం రోజుల పాటు దోమ మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపునకు గడువు పొడిగింపు

ధారూరు: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ రుసుము చెల్లింపునకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతనెల 30 వరకు 25శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు విధించిన గడువు ముగిసింది. కాగా అక్రమ లేఅవుట్లు, కచ్చ లే అవుట్లలో ప్లాట్లు కొని ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించేందుకు అమోదం పొందిన వారికి 25శాతం రాయితీని వర్తింప చేస్తూ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ధారూరు: ఊరడమ్మ నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. వికారాబాద్‌లోని అలంపల్లి కెంపిన మఠం అప్పగారు డాక్టర్ చెన్న బసవ ప్రభువు స్వామి సమక్షంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు.

ఊటుపల్లిలో వీధి నాటకం

దోమ:మండలంలోని ఊటుపల్లిలో ఆంజనేయ స్వామి భజన భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జునస్వామి మహత్యం వీధి నాటకం నిర్వహించారు. కేఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశం, గోవర్ధన్, నర్సింహులు, మణికంఠ, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పూడూరు: దేవనోనిగూడెం గ్రామంలో సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. మార్చి చివరి నాటికి రైతులకు వందశాతం రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు 40 శాతం కూడా చేయలేదన్నారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


కిరణ్ సార్డాను అభినందిస్తున్న మహిళలు

తాండూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజస్థానీ ప్రగతి సమాజం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీధర్ గగ్రాని, కార్యదర్శిగా సంపత్ కుమార్ సార్డా, కోశాధికారిగా సంజయ్ సోని, ఉపాధ్యక్షుడిగా ఓంప్రకాష్ పార్థాని, సహాయ కార్యదర్శిగా ఆనంద్ శర్మ ఎన్నికయ్యారు. అదేవిధంగా రాజస్థానీ మహిళ మండలి నూతన అధ్యక్షురాలిగా కిరణ్ సార్డా, కార్యదర్శులుగా వర్ష, కైలాస్ సార్డా, కోశాధికారిగా కల్పన ఆనంద్ రాఠి, ఉపాధ్యక్షురాలిగా హేమగోవింద్ సోని, వైజయంతి, మాల భగవాన్ దాస్, సహాయ కార్యదర్శులుగా రాధిక మధుసూధన్ సార్డా, రీతు సంజయ్ సోనిలు ఎంపిక కాగా వీరిని మర్వాడి సమాజ్ పెద్దలు రమేష్ చంద్ర సార్డా, రాజ్‌గోపాల్ సార్డాలు బాలాజీ మందిరంలో కొత్త కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు.

సైబర్ నేరాలపై అవగాహన


కులకచర్లలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కులకచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కులకచర్ల పోలీసులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే చెప్పరాదన్నారు. బస్సు ఎక్కే, దిగే సమయంలో, సంతల్లో, ప్రజలు గుంపుగా ఉండే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్ అపహరణకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేయడంతో కలిగే అనర్థాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరు: పదో తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులకు హెడ్ కానిస్టేబుల్స్ మహేష్ కుమార్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

45శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కులకచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ, గౌడ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. కులకచర్లలో బుధవారం పలువురు బీసీ, గౌడ సంఘం నాయకులు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తీర్మానం చేసి పంపిన 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర పార్లమెంట్‌లో ఆమోదం తెలపాలన్నారు. ఆర్టికల్ 9లో బిల్లును పొందుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ, గౌడ సంఘం నాయకులు కృష్ణయ్యగౌడ్, రాములుగౌడ్, వెంకటయ్యగౌడ్, నారాయణగౌడ్, వెంకటయ్య, విజయ్‌కుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా జాతర స్థలంలో బండలాడుగు పోటీల్లో పాల్గొన్న కాడెద్దులకు చికిత్సలు అందించారు. ముందు జాగ్రత్త చర్యగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి నోహ తెలిపారు.

ఆదర్శప్రాయుడు సర్వాయి పాపన్న


ఘట్‌కేసర్‌లో పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గౌడన్నలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే కృష్ణయ్యగౌడ్ అన్నారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. కులకచర్ల పల్లె ప్రకృతి వనంలో గల పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి తిరుమలపూర్ రాములుగౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన గొప్పమహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న అని పలువురు వక్తలు అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ చౌరస్తా వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేష్ శ్రీనివాస్, బాలేష్, ఎస్.శ్రీనివాస్, సురేష్, అంజనేయులు, పల్లె విజయ్, మధు పాల్గొన్నారు.